# చెదిరిన కల- పగిలిన అద్దం

**కలంతార**

[చిత్ర నిర్మాతలు కొత్తతారలకోసం వెదికినట్లే అనామిక మేనేజ్‌మెంట్‌వారు కొత్త రచయిత్రుల కోసం వెతకగా— ఒక అనామక రచయిత్రి దొరికింది. స్నేహ పూర్వకంగా ఆమె రచనలు చూసి, సంతోషించి— ఎందుకిలా తెరవెనుక తారలా ఉండిపోయారని అడుగగా— తమ కుటుంబ పెద్దలు—ఆడవాళ్ళు రాజకీయాల్లో దిగినా, రచయిత్రులుగా మారినా మంచిది కాదనే శాఖవాళ్ళట అందుకని, ఆమె తన రచనలని ప్రచురించలేదని చెప్పింది మేము ఆమె పేరు బయటికి రానీయమని హామీ యిచ్చి ఆమె రచనలకి మెరుగులుదిద్ది ప్రతి నెలా ప్రచురించడానికి అనుమతి పొందాము. "కలం తార" పేరుతో వచ్చే ఈ రచనపై ప్రత్యేక అభిప్రాయాలు పంపవలసినదిగా కోరుతున్నాం.]

— అనామిక.

ప్రేమించడం ప్రేమికులు అనుకోగానే ఇరవై, ఇరవై అయిదేళ్ళ లోపు వయసు వారు గుర్తిస్తారు కాని ప్రస్తుతం కథ విషయం మాత్రం వేరు.

పెళ్ళయిన ఇంతకాలానికి, పెళ్ళి చేసుకొన్నందుకు, ఖచ్చితమైన ఇల్లాలినైనందుకు, పిల్లల తల్లినైనందుకు మొదటి సారిగా ఎప్పుడు విచారించానంటే — అతనితో పరిచయం పెంచుకున్నప్పుడు అతనిని ప్రేమించకుండా వుండలేకపోయినప్పుడు. తెలిసి మావారు క్షమించినప్పుడు, అదెలా జరిగిందంటే, మా దాంపత్యం Made for each other లా మూడు పువ్వులు, ఆరు కాయలుగా గడిచింది. ఏ స్త్రీ అయినా భర్తద్వారాను, సంసారంలోను ఎన్ని సుఖాలు పొందాలో అన్నీ పొందాను. అపారమైన వారి ప్రేమ నాయందు ఎప్పుడూ పూర్తిగానేవున్నది.


అందరి భర్తలలాగానే వారికి పరస్త్రీ వ్యామోహం వున్నప్పటికీ నాకేలోటు రానీయనందువల్ల నాకు కష్టంగా వుండేది కాదు తాను ప్రతీది ధైర్యంగాను,

సరదాగాను నిజం చెప్పడం వలన నాకు ద్వేషం కలుగక పోగా సంతోషంగా వుండేది. కానీ నాకొక విషయంమాత్రం ఆశ్చర్యంగా వుండేది. అదేమిటంటే రకరకాల దుస్తులలాగే, తినుబండారాల లాగే స్త్రీపురుషుల పర వ్యామోహంలో ఆకర్షణలో వుండే కొత్తదనం ఏమిటా... అని? ఇలాంటి వెధవాలోచనలు రాకుండా వుండాలే కానీ, వస్తే మనం ఎంత అణచిపెట్టినా మధ్యమధ్య తలెత్తుతూనే వుంటాయి. అలాంటి ఆకర్షణలో సదా లనే కోరిక, ధైర్యం, అవకాశం వచ్చి నపుడు మనం ధీమాగా నిలబడగలమా అన్న సంగతి ఎవరికి వారే నిర్ణయించు కోవాలి. "మనసు గుఱ్ఱమురోరి మనిషి దాని పట్టి నడిపించాలి తెలిసి."

మొదటి సారిగా అతన్ని చూసి నపుడు కన్నెవయస్సయితే లవ్ ఇన్‌ఫస్ట్ సైట్ (ప్రథమ వీక్షణంలో ప్రణయం) ఏర్పడుతుందేమో గాని, ఈ వయసులో నాకేమీ అనిపించలేదు. అయితే ఒక విధమైన కుతూహలము బహుశ ఆక ర్షణ కలిగిందనుకుంటా. ఆ ఆకర్షణ చాలాకాలం తరవాత రూపు దాల్చి, నిజమై, నన్ను వెంటాడి వేటాడి నాశనం చేసింది.

తినగ తినగా వేము తీయగనౌనో కాదో గాని తినగ తినగ తీపి మాత్రం మొహంమొత్తి,కాస్త కారంమో,పులుపో కావాలని పిస్తుంది. అలాగే శ్రీవారి ప్రేమ అతి మధురమై లభించడంచేత ఒక విధమైన అసంతృప్తి, నిర్లక్ష్యమూ, ఏర్పడి నా మానసిక స్థితి అల్లకల్లో లంగా వున్న సమయంలో అతనితో పరిచయమైంది. ఏదైనా ఒక దురాలో చన మనకి కలగగానే, ఎదురైన అవకాశాన్ని మన అవసరం కొలది వాడుకోవాలి. అంతేకాని అవ కాశం మన కోసం జన్మెత్తి ఎదురుగావచ్చి నిలబడదు. ఇలాంటి మనః స్థితిలో అతను పరిచయం అయి నాడు కనుక, అవసరానికి పనికి వచ్చే టట్లు నేను అతన్ని అర్థం చేసుకున్నా నని చెప్పక తప్పదు. ఎందుకంటే ఈ సభ్య సమాజంలో నిత్యమూ ఎవర్తోనో పరిచయం కలగడం మామూలే. అలా గని ప్రతిసారీ ప్రతివాళ్ళతోనూ పరి చయం పెంచుకోవడం జరగనిపని. నా కతనియందు కలిగిన అభిప్రాయం. దాన్నేమనాలో తెలియక తెలుసుకున్నాక నన్ను నేనే నమ్మలేకపోయాను. ఆ విషయం అతనికీ, మా వారికీ కూడా తెలియకుండా వుండడంకోసం, నేను చేసిన ప్రయత్నాలు, చెప్పిన అబద్ధాలు రాసేందుకు భాషేలేదు. యధాతధంగా మీకు అర్థమయ్యేట్లు చెప్పడానికే ప్రయ త్నిస్తాను.

చల్లబడే వేళ పిల్లలకి అయిస్‌క్రీం ఇప్పించి, ఫుట్‌పాత్ మీద నడుస్తుం డంగా, పక్కనే ఆగిన కారు లోంచి అతడు తొంగి చూసి విష్ చేశాడు. "రండి డ్రాప్ చేస్తాను" అన్నాడు. ఉగి. ఇంటి కెళ్ళడంలేదని కాసేపు పార్కులో కూర్చోడానికి వెడుతున్నానని అన్నాను. "ఇంకేం నాకూ పనిలేదు. అందరం వెడదాం"అంటూ కారు డోరు తెరిచాడు. పిల్లలూ, నేను, అతను పార్కులో దిగ్గానే _ పిల్లలు వాళ్ళ స్నేహితులతో




ఆడుకోడానికి అటూ ఇటూ వెళ్ళారు. నేనూ, అతను లాన్‌లో కూర్చుని ఏవో మాట్లాడుకున్నాము. అంతకుముందు నా కతనితో ఆట్టే పరిచయంలేదు. ఒకటి రెండుసార్లు మాత్రం మా వారితో వచ్చినప్పుడు కలిసినా, ఎక్కువ మాట్లాడే అవసరం రాలేదు. ఇప్పుడు తీరికగా మాట్లాడుతుంటే, అతని ధోరణి నాకు చాలా నచ్చింది. నచ్చడమూ అంటే వక్తకీ సభికుడికీ, నటకుడికీ - ప్రేక్షకుడికీ, గాయకుడికీ – శ్రోతకీ ఒకరియందు ఒకరికేమి నచ్చుతుందో ఆ రకం నచ్చడమే అంతే. కాసేపు మాట్లాడాక "మీరుమంచి చదువరిలా వున్నారే" అన్నాను నేను

"మీరు రచయిత్రిలా మాట్లాడుతున్నారే" అని నవ్వాడతను. అది నవ్వా? కనుచివరల్తో నవ్వాడో, పెదవులతో నవ్వాడోగాని ఆ రకం నవ్వు చాలా అరుదుగా వుంటుంది.

"కాకి 'కావు' మనడమూ, పిల్లి 'మ్యావు' మనడమూ సహజమేకదా!" అన్నాను నేను.

"అంటే?" అని ప్రశ్నలాగా నా మొహంలోకి చూశాడు.

"అంటేనా? అది అంతేలే"– అని నా భావం అతనికి కనబడకుండా ముఖం ప్రక్కకి తిప్పుకున్నాను నేను. అతను తెలివైన వాడనడంలో సందేహం లేదు. క్షణం ఆలస్యమయినా సంగతి గ్రహించాడు.

"మీరు–మీరు రచయితలా? అద్భుతం. కలం పేరుతో రాస్తారా? మీ కథలు ఏ పత్రికల్లో వచ్చాయి?"

అని గబుక్కున నా చెయ్యి పట్టుకున్నాడు. నిశ్చయంగా కావాలని అతడు అలా చెయ్యలేదు. హఠాత్తుగా కలిగే ఆశ్చర్యంతో వుద్రేకంతో మనిషి చేసే అసంకల్పిత క్రియల్లో అదీ ఒకటి. నేనేమీ అనలేదు. చెయ్యి

వెనక్కి తీసుకున్నాను.

"నేను తెరవెనుక తారనండీ. నేపథ్య సంగీతం లాంటి నా రచనలు ప్రింటులో రాలేదు" ఐనా అచ్చులో వున్న వారందరూ నిజంగా రచయిత లేనా ? అన్నాను.

"అదేమిటి? ఎందుకని" అన్నాడు దెబ్బతిన్నట్టు.

ఇంతవరకూ ఎవరితోటి నేను రచయితనని నా నోటితో అనలేదు ఇవాళ ఎందుకనో నాకే తెలియకుండా అతని కిలా సమాధానం చెప్పాను.

"మీకు తెలుసో లేదో రచయిత్రుల, కళాకారుల, గాయనీమణుల సంసార జీవితాలు సుఖంగా వుండవు. ప్రజల్ని మురిపించే వారి సహజ కళలే, వారి పాలిటి శాపాలు. వారిలో గొప్పదనం మీద, వారి నిజాయితీ మీద – ఆమె తరపు వారికి ఏ మాత్రం నమ్మకం వుండదు. ఒక నర్తకినో, గాయకినో, చిత్రకారిణినో చూసి, ప్రేమించి కోరి, బ్రతిమాలి, బాసలు చేసి పెండ్లాడే యువకులే – ఆ యువతి తన భార్య అయినాక చాలా త్వరలోనే, ఏ గొప్పదనాన్ని చూసి ఆమెను కోరిపెళ్ళాడారో ఆ గొప్పదనాన్ని ఒప్పుకోరు. ఇష్టపడరు. ఆ గొప్పదనం, తమకే పరిమితం కావాలని వున్నా కాదనలేక కొంతకాలం భరిసారు ముఖ్యంగా ఆ కళలు అసలే లేని భర్తలు ఆ భార్యల్ని ఎంత హింసించుతారో, బైటవాళ్ళు ఊహించనూ లేరు" అన్నాను. అతనికి అర్థం కాలేదు. కాని చెప్పింది విన్నాడు. నిజాన్ని వెంటనే నమ్మలేకపోయినా, నమ్మక తప్పదు గదా? "నేనింత రాస్తానని తెలిసి ఒక్కనాడయినా మావారు ఏం రాస్తున్నానో చూడనేలేదు" అన్నాను బాధగా– "నేనున్నానుగా నాకివ్వండి. అన్నీ చదివేస్తాను" అన్నాడు తొందరగా. ఒక్కొసారి అనాలోచితంగానే అన్న మాటలకి, అర్థం వాగా ఆలోచిస్తే భయం వేస్తుంది. అతని దగర మంచి కలక్షన్ వున్నదట, అవన్నీ నేను చదవాలట, అతని లైబ్రరీలో ఏమున్నాయో చూడాలని నాకూ అనిపించింది. ఆ విధంగా పరిచయమైనాక మావారితోపాటు, అతనూ మా ఇంటికి వచ్చేవాడు. వస్తూ మంచిబుక్కులు తెచ్చేవాడు ముగురం కలిసి ఎన్నో విషయాలు మాట్లాడుకునే వాళ్ళం. ఒకరోజు సంభాషణ రాజకీయాల నుంచి రచనల వైపుకి మళ్ళింది. నా రచనలిమ్మని అడిగాడు అతను. నేను మావారివంక చూశాను. ఆయన మొహంలో హేళన, మా గొప్ప రచయిత్రివే–అన్న భావన నా నర నరాల్లోనూ చలిలాగ పాకింది, రోషంతో నాకు ఒళ్ళు తెలియలేదు. చప్పున లేచి, అల్మారులోవున్న నా ప్రాణాలు–నా రచనలు–నా సర్వస్వం అతని చేతుల్లో పెట్టాను. అన్నట్టు అతని పేరు చెప్పనే లేదుకదూ! అతని పేరు 'మధు' అతని చేతుల్లో పెడుతూనే గర్వంగా మావారి వైపు చూశాను. మావారు నవ్వుతూనే– "ఇదిగో మధూ! చప్పున కళ్ళజోడొకటి కొనుక్కొని మరీ చదవాలి. ఆమె ది బ్రహ్మరాత సుమా. ఎందుకంటే పెళ్ళయిన కొత్తలో ఆమె రాసిన ప్రేమ లేఖల్ని ఎవరి చేతన్నా చదివించుకునే వాడిని. కొన్ని ఇంకా చదవనే లేదు."

అన్నారు. ప్రపంచంలో అన్నిటికంటే నేను భయపడేది సిగ్గుపడేది వారి నవ్వుని చూసే. ఆ నవ్వులో ప్రేమ, లాలింపు, కవ్వింపూ — ఇప్పటికీ ఇంకా కొత్తగానూ, ఆశగాను వుంటుంది. అలా ఆయన నవ్వినప్పుడు ఒంకరపోయే ముక్కుని ఎంతమందిలో వున్నా సరే గిల్లాలనిపించి నిగ్రహించుకోవడానికి కోపం నటిస్తాను. ఆయన నవ్వితే నాకు కోపం వస్తుందో....నాకు కోపం రావాలనే ఆయన నవ్వుతారో— ఇంతవరకు తేలలేదు. ఆయన అలా నవ్వాలని నేనూ, నేను కోప్పడాలని ఆయన ఎదురు చూడ్డంలోనే జీవితం గడుస్తోంది. మా ఈ స్థితిచూసి మధూకి సరదా వేసినట్లున్నది. ఈ తెచ్చి పెట్టుకున్న అలకని అతను గ్రహించాడు. వెంటనే నన్ను సమర్థిస్తూ మావారితో "మీకు తెలుసో లేదో కాని మంచి రచయితలకి చక్కని దస్తూరి, మహానటులకి శ్రావ్యమైన కంఠం వుండవు. రచయిత రాతగాడిని (Scribe), నటకుడు పాటగాడిని ఎరువు తెచ్చుకోక తప్పదు. సుజాతగారూ! మీరు నన్ను రాతగాడుగా వాడుకోవచ్చుకూడా" అన్నాడు అప్పుడు "అలా అన్నావు బావుందోయ్, నీవు ఫెయిర్ చేశాక ఆవిడ రచనలు చదువుతాను." అని హామీ ఇచ్చారు మావారు.

అప్పటి నుంచి తరచు అతను రావడమూ మొదలైంది. నేను చెబుతూ వుంటే అతను తన ముత్యాలవంటి దస్తూరీతో పెద్ద పుస్తకంలోకి రాయడమూ జరిగేది నేను చెప్పేది మధుర సంగీతమైనట్లు అతను, అతను రాసేది అందమయిన చిత్రలేఖనమయినట్లు నేను భావించి మైమరచి చెప్పడమూ, రాయడమూ మరచిపోయి నా రచనలోని పాత్రలు సజీవాలై, నాయకీ నాయకులు మేమిద్దరమే అయినట్లు, అభినయిస్తున్నట్లు ఊహాలోకాల్లో తేలిపోతూ. రెండుక్షణాల్లో తెలివివొచ్చి చూసుకుంటే ఒక్క పేజీకూడా తిరిగేసి కాదు. ఒకరికొకరు ద్రోహం చేసినట్లు, క్షమించమన్నట్లు దృష్టి మరల్చుకొని, ఎదురుగా వున్న ఏదో ఒక పుస్తకం చేతిలోకి తీసుకుని, చదవబోయి, చదవలేక—ఒకరికి ఒకరం తెలియకుండా ఒకరినొకరు చూస్తూ, ఒకోసారి పట్టుబడి పోయినట్లు భయంలాంటిదేదో ఒళ్ళంతా పాకేది. కొద్ది రోజుల్లోనే, ఈ అవస ఎందులోకి దారితీస్తుందో, ముందుగా నేనే గ్రహించి జాగ్రత్త పడ్డాను. అతను నా ధోరణి గ్రహించాడో. లేక తనకే అనిపించిందో కాని క్రమంగా రావడం తగ్గించేశాడు. కాని రాజాతోపాటే ఇంటికివచ్చి ఎక్కువగా తనతోనే మాట్లాడి వెళ్ళిపోతుండేవాడు. వాళ్ళిద్దరితో పాటు నేను కూర్చునా — మా యిద్దరికీ ఏదో బెదురుగావుండేది. అతను రానిరోజు— రానందుకు సంతోషించుదామనుకున్నా అతడు రావాలనీ, అతన్ని చూడాలనీ మరింతగా అనిపించేవి హే భగవాన్ ఇదెందులోకి దారి తీస్తుంది? ఇది ఒక రకమైన వాంఛా? విరహమా? ఛీ....ఇలాంటి చౌకబారు ఆలోచన నాకు ఎలా వచ్చింది....అనుకుంటుంటే చాలా సిగ్గుగా వుండేది....!!

మనిషిలో హఠాత్తుగా ఏర్పడ్డ తీవ్ర

భావం కోపమో...దుఃఖమో, ప్రేమో ? ఏదైనాసరే-బయటపెట్టలేకపోతే అది గుండెల్లో అణిగి పోలేక వేరే రకరకాలుగా వెర్రితలలు వేస్తుంది. మధుతో పరిచయం తగ్గించుకున్నానేగాని - అతన్ని చూడాలనే వాంఛ కావాలనే వాంఛ-నాలో తొట్రుపాటు, ఆవేదన, ప్రతి పనిమీద పరాకు, మా వారిని చూస్తే బెదురు, చిన్న విషయానికే కన్నీళ్ళు-ఇదీధోరణి. మావారు తెలివైనవారే కాదు - మనస్తత్వాన్ని చదవగల వారు కూడా-అందులో ఎన్నోరకాల స్త్రీలతో అనుభవం వలన ఆడదాని మనసు ఇట్టే గ్రహించ గలరు. ఇంటిలో వుండే నన్ను ఎంతలో గుర్తించారని ? ఐతే ఆ సంగతి నాకు తేలియనీయలేదు. నన్ను అసహ్యించుకోలేదు, ద్వేషించనూలేదు. "మధు రావడం లేదెందుకని సుజా...!" అన్నారు ఒక రోజు. అనుమానంతో, భయంతో నా నోరెండిపోయింది ? .... ఆయనవంక సూటిగా చూడలేక పక్కకి చూస్తూ "నాకేం తెలుసు...." అన్నాను నేను. అప్పుడు ఆయనేం మాట్లాడలేదు. కాని మర్నాడు తన వెంట మధుని తీసుకొచ్చారు. మళ్ళీ తరచు అతడు వచ్చేటట్లు చేశారు. ముగ్గురము మామూలు ధోరణిలో పడ్డాము. ఐతే మధునీ నన్నూ ఆయన ఒక కంటితో పరిశీలిస్తున్నారని అప్పట్లో తెలియలేదు.

కొన్నాళ్ళు గడిచాయి. చాలా ఉషారుగా యింటికి వచ్చారు వారు. వస్తునే "సుజా!" అని వంటింట్లోకి కేకవేశారు. "పది రోజులు అలా దేశం తిరిగి వద్దాం తయారు కా" అన్నారు. ఔను ఊళ్లు చూసి రావాలని ఎన్నోసార్లు అనుకున్నాం కుదరలేదు. వారంరోజులు శ్రమపడి ప్రయాణానికి ఏర్పాట్లు చేశాను. రాత్రి ప్రయాణ మనగా వారు మధ్యాహ్నం ఇంటికి వచ్చేశారు- రెండు రిజర్వేషన్ టిక్కెట్లు, వేయిరూపాయలు నా చేతికిచ్చి- "చూడు సుజా-హఠాత్తుగా నా లీవ్ కాన్సిల్ ఐంది. డైరెక్టర్సు వస్తున్నారు. ఈ నెల అంతా పని వుంది. నీవు ఏమీ అనుకోక. ఎలాగూ రిజర్వేషన్ టిక్కెట్లువున్నాయి. అన్ని ఏర్పాట్లు అయ్యాయి. నా కోసం నువ్వు మానుకోవడం ఎందుకు..?" అన్నారు. "మీరులేందేనేనుఎలావెళ్తాను-నా కిష్టం లేదు. వీలున్నప్పుడే వెళ్దాం. అంత తొందరేమీ లేదు లేండి"అన్నాను "ఒంటరిగా వెళ్ళలేవని నాకు తెలుసు, అందుకనే మధుని ఒప్పించి వచ్చాను. అతను అన్నీ సర్దుకుని స్టేషన్‌కివస్తాడు" అన్నాడు. అనుమానంతో, భయంతో నా నోరెండిపోయింది ఆయన ఉద్దేశమేమిటో తెలుసుకోవాలని ఆయన ముఖంలోకి చూశాను. నవ్వుతూ నన్ను దగ్గరకు తీసుకుని - "పిచ్చిదానా - నేను ఏది చెప్పినా నువ్వు కాదనలేదు - ఇప్పుడూ అనకు. మంచైనా, చెడైనా, నేను బాధ్యుణ్ణి....సరేనా...!" అన్నారు. ఆయన ఒక నిర్ణయానికి వస్తే దానికి తిరుగుండదు. నాకు తెలుసు. ఇలాంటప్పుడు ఆయన ఎక్కువ మాట్లాడరు. ఆయనది శాసనం. నాకు కాదనే శక్తి లేదు. నాలో సన్నని వణుకు మొదలైంది. మధునీ, నన్ను ఆయన అను

మానించారా ....? నన్ను శాశ్వతంగా బహిష్కరిస్తున్నారా! ఖర్మ కొలది సీతమ్మ అరణ్యవాసం కోరింది. వంక దొరికినప్పుడు రాముల వారు ఆమె నిండు చూలాలనైనా జాలి దలంచక అడవిలో వదిలేశాడు. ఈరోజు నాకూ అదే గతిపట్టిందా? "ఓభూమాతా! బ్రద్దలై"పోఅని సీత అన్నది. భూమాత విన్నది. మరి నేను అంటే ఎవరు వింటారు—వారు చెప్పేమాత్రం మధు తనతో వస్తానని ఎలా ఒప్పుకున్నాడు... ఏమి జరుగుతున్నది. ఇంత భయం లోనూ ఏ మూలో మధుతో వెళ్ళాలని సంతోషంగావున్న దేమిటి? కావాలనీ, వద్దనీ ఈ విరుద్ధ భావాల కలయిక ఎంత దారుణం .... ఏకాంతంగా మధుతో తిరిగితే ఏమౌతుంది. అసలతను తన గురించి ఏమను కుంటున్నాడో. తిరిగి తాని యింట్లోకి రాగలదా. వారు రాని స్తారా? అసలెందుకు పంపుతున్నారు...? నాసతీత్వం మీద ఆయన కంత నమ్మకం కాబోలు....!

కదులుతున్న రైలులోంచి కళ్ళ నిండా నీటి పొరలు. ప్లాట్‌ఫారం మీద చేయి వూపుతూ ఆయన మసక మసకగా కనిపిస్తున్నారు. దూరంగా - యింకా దూరంగా చివరికి ఆయన, ఆవూసు కనిపించ లేదు. నన్నే చూస్తూ నావెనకగా మధు నిలబడి వున్నాడు.

మెయిల్లో తెల తెలవారుతుండగా మద్రాసులో దిగాం. పాంగ్రూవ్ హోటల్లో డబుల్ రూం తీసుకున్నాం. పగలంతా ముఖ్యమైన స్థలాలు చూచి షాపింగ్ చేశాం. సాయంత్రం మెరీనా బీచ్‌కి వెళ్ళి, చక్కని పనితనంగల నల్ల చలవరాతి అన్నా సమాధిచూశాం. చూచి, చుట్టూ తోటలో కాసేపు తిరిగి కొంచెం దగ్గర్లోనేవున్న ఎక్వేరియంలోకి వెళ్ళాం. రకరకాల అందమైన చిన్నా పెద్ద చేపలు గాజు తొట్లలో స్వచ్ఛమైన నీటిలో నీటి మొక్కల మధ్య ఈదుతుంటే, సరదాగా ఎవరూ చూడకుండా అందులో చేయిపెట్టి, ఓ చేపను పట్టేసుకుని - నా చేతి రుమాలులోనో, మధూ జేబులోనో దాచాలనిపించింది. చేపలకి మేతగా వేయబడ్డ ఎర్రదారం పోగుల వంటి సన్న పురుగుల కుప్పలు, చేపలు పీకినప్పుడల్లా నిస్సహాయంగా కదుల్తుంటే చూడలేక బయటికి వచ్చి మెరీనా బుహారీలో ఓపెన్‌ఎయిర్ కేంటీన్‌లో ఓమూల టేబిల్ ముందు కూర్చున్నాం. తక్కిన అన్ని పట్టణాలలోకంటే ఈమద్రాసులో ఓ ప్రత్యేకత కనిపిస్తుంది. అదేమిటంటే సినిమా వాతావరణం. జంటలు జంటలు యువతీ యువకులు—ఎవరికెవరు ఏమవుతారో? వాళ్ళకే తెలియును. ప్రేమికులా? దంపతులా? లేచి వచ్చినవాళ్ళా? స్వేచ్ఛా ప్రణయ సమాజంవాళ్ళా? లేక- స్టేజీ నటుల్లా అర్జంట్ కపుల్సా? నా బుద్ధి తక్కువ బుర్ర మొద్దుబారి పోయింది.

అడిగిన అరగంట లోపుగా ఏ సర్వరూ ఏమీ తీసుకురాడు. ఈ వైట్ డ్రస్ గాళ్ళకి ఆ వచ్చినవాళ్ళు ఎవరికి ఏమి అవుతారో క్షుణ్ణంగా తెలుసు. అందుకే తిన్న బిల్లుతో బాటు అయిదు రూపాయల టిప్పు దొరుకుతుందివాళ్ళకి. ఆ రకరకాల హోటలు అతిధులంతా డబ్బుతో మునిగితేలినట్లు నటిస్తున్నారు.

ఆ డబ్బు ఎక్కడిది? అప్పు చేసిందా? అచ్చు వేసిందా? మోసంతో సంపాదించిందా? ఓహో! ప్రపంచంలో దేనికయినా కళంకంవుంది కాని డబ్బుకి లేదు. ఏ రకంగా వచ్చినా డబ్బు చాలా పవిత్ర మయిందే. దాని విలువ సమస్త ప్రాణి కోటికి తెలుసు. గొప్ప వాడికీ-బిచ్చగాడికీ కూడా రూపాయి రూపాయిగాను, పైసపైసగాను అమ్మెపోతుంది. పసిబిడ్డ ఎవరూ నేర్పకపోయినా సహజంగా నేర్చుకునేది ఏడుపు తరువాత డబ్బు విలువ మాత్రమే.

ఆ వాతావరణం నించి చప్పున బైటపడి సంతలాంటి షాపింగ్ సెంటర్ని దాటి, సముద్రపొడ్డుకి చేరాం. ఒంటిగా కూర్చొందామంటే చోటే లేదు ఆ మహా జలరాశి ముందు తన్మయత్వంతో హర్షించనే గాని దాని అద్భుత సౌందర్యం మనసు నిండా నింపుకోడం కుదరదు. అందుకని ఇసుకలో నడవడం కష్టంగానున్నా మధు చెయ్యి పట్టుకుని దూరంగా- చాలా దూరంగా నడి



చాను. పాపం మధు చిన్న పిల్లవాడిలా కనిపించిన దంతా కళ్ళ నిండా చూస్తూ సంతోషంగా వున్నాడు. అతన్ని చూస్తోంటే రచయిత కాక పోవడం ఎంత అదృష్టం అనిపించింది నాకా క్షణంలో. అతి తెలివికంటే అమాయకత్వం చాలా సుఖమైనది. ఏకాంతంగా కూర్చొని అలల అందాల్ని హొయనీ అనుభవించడం కోసం జనానికి దూరంగా స్థలం వెతుకుతోంటే పడవల చాటునా, ఇసుక దిబ్బల చాటునా స్త్రీ

నీడలో స్త్రీ పురుషులిద్దరే చేరి పొందగల ఆనందంలో కొంత భాగం అనుభవిస్తూ కనిపించారు. కొందరు చిత్రమేమంటే మా ఇద్దర్నీ చూసి ఎవరూ జంకలేదు. కొందరసలు గమనించే స్థితిలో లేరు. ఒకరిద్దరు మేమూ అందుకోసమే వచ్చామని అనుకున్నట్లు చనువుగా, మౌనంగా నవ్వారు. ఆ నవ్వు చూచినప్పుడు, నా ప్రక్కన నా భర్త కాక మధూ వున్నందుకు సిగ్గనిపించింది. కోపం వచ్చింది ఇంకేదో అనిపించింది దాంతో చికాగ్గా



"చప్పున నడవరాదూ అటు వాళ్ళని ఏమిటి చూసేది" అని మధుని కసిరాను. పాపం! అతడు బిత్తరపోయి నా చెయ్యి వదిలేశాడు. చివరికిద్దరం ఒక చోట కూర్చొన్నాం. ఆ రోజు పౌర్ణమి. నిండు చంద్రుడు నీటిలో మునుగుతూ, తేలుతూ, దాక్కొంటూ కవ్విస్తోంటే సముద్రం పొంగి, ఆయాసంతో నురగలు కక్కుతూ పలేని కొప్పుతో ఎగిరెగిరి పడుతోంది. ఏమీ చేయలేని ఆ అభాగ్య ప్రేయసిమీద జాలితో నాకళ్ళుచెమర్చాయి. ఇష్టంలేకపోతే తప్పుకోక, ఆ పూర్ణ చంద్రుడు యుగ యుగాల నుంచి ఈ జల కన్యను ఊరించడం ఎందుకు? ఆశపెట్టడమేకాని అందదని తెలిసి ఈ పిచ్చి సముద్రం ఎదురు చూడ్డమెందుకు? కేవలం చంద్రుడి ఛాయ తన మీద పడినంతమాత్రాన తన సౌందర్యం ఇంత ఆకర్షణీయంగావుందే-ఇక ఆతడు ఒక్కసారి తనతో కలిస్తే ఏమవుతుంది? ఆ ఆనందంతో తాను పొంగి వుప్పొంగి పరవశించి, పరుగులెత్తి ఈ ప్రపంచాన్ని ముంచేసుందా? కావచ్చు ప్రళయం రావచ్చు. అందుకే కొన్ని ఆశలు ఆశలుగానే మిగిలిపోవాలిగాని ఆచరణలోకి రాకూడదు. ఈ అద్భుత ప్రణయ దృశ్యం చూస్తోంటే నా మనస్సు జల్లుమంది. ఈక్షణంలో తానూ మధు ఏకమైపోతే, అతని కౌగిలిలో తాను పరవశించిపోతే-ఇద్దరూ కలిసి ఆ గంగలో దిగి లీనమైపోతే-విచిత్రమైన వాంఛతో నా కేమయిందో తెలియదు. నా మనస్సు నా శరీరం నా అధీనం లో లేనట్లు ప్రియా ప్రియా అని కలవరిస్తోంటే - దాదాపు తడి యిసుకలో పడుకున్న నేను కొంచెం జరిగి ఆహ్వానిస్తున్నట్లు ఒక్క క్షణం సేపు మధూ కోసం చూశాను. చేతికి అతను తగలేదు. తుళ్ళిపడి తెప్పరిల్లి, తేరిచూశాను. ఎప్పుడు వెళ్ళాడో అయిదారు గజాల దూరంలో కూచుని, తలని రెండు మోకాళ్ళ మధ్య పెట్టుకుని, రెండు చేతులు కాళ్ళ చుట్టూ బిగించి కూర్చున్నాడు. ఒకటి రెండు అలలు అతని పాదాల్ని తాకి, బట్టలు తడిపి వెళ్ళిపోయాయి. నా దురవస్థలోంచి తేరుకుని భయంతో అతనిదగ్గరకు వెళ్ళి "మధూ ఏం చేస్తున్నావ్" అని చెవుల్లో నోరుపెట్టి గుసగుసగా అడిగాను. అతను మాట్లాడలేదు. ఏడుస్తున్నట్లు చిన్నగా వెక్కిళ్ళు వినబడ్డాయి. భయంతో ఆశ్చర్యంతో కదిపి, అతని తలెత్తి చూశాను. కన్నీళ్ళతో తడిసిన అతని నిర్మలమైన మొహాన్ని చూసి నా గుండె తరుక్కుపోయింది. చివ్వున అతన్ని ఒళ్ళోకి లాక్కున్నాను అతని ముఖాన్ని నా గుండెలకి హత్తుకుంటుంటే, మంగళసూత్రాలు అడ్డుపడ్డాయి. అతని నుదుటిమీద ముద్దు పెట్టుకున్నాను. చిత్రమైన ఆ అనుభూతిని ఇలా కాగితంమీద రాయలేను. మీకు చెప్పలేను. అది అదే. మీతో చెప్పలేను. దానికి సాటిలేదు. నాలోని నీచత్వం ఎటు పారిపోయింది? ఏడ్చే ఆతడు నా కొడుకువలె, తమ్ముడివలె, దిక్కులేని ఆశ్రితుడివలె-నేను ఆదరించు మాతవలె ఓదార్చాను. నా కౌగిలి నిష్కల్మషంగా, నిర్వికారంగా మారిపోయింది. స్త్రీ సహజ

మైన ఔదార్యంతో అతని కన్నీళ్ళు తుడిచి "లే, ఏమయ్యింది, పోదాం పద"—అని లేవదీసి చేయూతనిచ్చి, రోడ్డువైపుకి నడిపించాను. అతను మంత్రముగ్ధుడివలె-నాతో నామీద ఆధార పడి కలలోలాగ నడిచాడు. టాక్సీలో కూడా అతను మాట్లాడలేదు. హోటల్ లిఫ్టులో అతనికి ఒళ్ళు తెలిసింది-ఆశ్చ ర్యంగా, భయంగా చుట్టూ చూసి స్థిమిత పడ్డాడు, రూంలో-రెండు మంచాలు. విజి టర్స్ కోసం సోఫా సెట్టు వుంది. ఆ సోఫా కంబెడ్ మీద ఒకరు హాయిగా పడుకోవచ్చు. పగలంతా చూసిన ఈ గదే ఇప్పుడు ఏదో కొత్తగా వుంది. నిజానికి గది పాతదే. మామూలుగానే వుంది మారింది మా మన స్తత్వాలు. మాకు అలసటగా వుంది. అతడు భయం గానూ, ఆలోచనగానూ పక్క వంక చూశాడు. అప్పుడుగానీ ఇద్దరూ ఒకే గదిలో పడుకోవాలని అతనికి తోచలేదు. ఇంకా మౌనంగానే, పరధ్యానం గానే వున్నాడు. దిండు, దుప్పటి తీసుకుని విజిటర్స్ రూం సోఫా కంబెడ్ మీద ముసుగుపెట్టేశాడు. నే నేం మాట్లాడించలేదు. బెడ్ లైట్ వేసి పక్కమీద వాలాను. ఈ ఆపద ఎలా తప్పిపోయింది? మాంగల్యరక్షణా? వేద మంత్రాల బలమా? భారత స్త్రీ సతీత్వశక్తా? ఏమిటిది? ఆ ఆవేశంలో నేను చేయిచాచినపుడు, అతను అందు కుంటే అతనూ అదే వికారంలోవుంటే సర్వనాశనమైపోయేది. స్త్రీతో చనువు తప్పు. స్త్రీ పట్ల వ్యామోహం, వాంఛ ఇంకా కలగని, ఏర్పడని అతనికి ప్రప్రథమంగా ఆ రోజే ఆ వాతావరణం లోనే - ఆ స్వేచ్ఛాప్రియుల విలాసాలు చూశాకనే - తన సమక్షంలోనే హఠా త్తుగా మనస్సు తెరచుకొందనడంలో సందేహం లేదు.

అతనికి అలాంటి ఆలోచన కొత్త గనుక అయోమయంలో పడ్డాడు. బెదిరి పోయాడు. తాను అతని దృష్టిలో కేవలం స్నేహితురాలు మాత్రమే. మానసికంగా అతను పసిబాలుడు. ఇటువంటి స్థితిలో అతడ్ని కాపాడక పోతే అతడి జీవితం నాశనమై పోతుంది. కష్టాలు శాశ్వతంగా మర్చిపోవా లంటే చావు గొప్ప అవకాశం. తాత్కా లికంగా మర్చిపోవాలంటే నిద్ర - గాఢ నిద్ర - వరం లాంటిది. మథూ - నిద్రపో - నిద్రలో నీ బాధ మర్చిపో- అన్యాయంగా నిన్ను రొంపిలో దింపిన దాన్ని నేను - నీకు తెలియదు గనుక నిర్విచారంగా వున్నావు. తెలిసిన నేను- నీకు హానిచేయలేను. నేను నాశనం కాలేను. నా సంసారం వదులుకోలేను. ఓ దైవమా! నీ వున్నావో లేదో నాకు తెలియదు. ఉన్నట్లయితే - ఋజువు చేసుకోవయ్యా! మానవుల బలహీనతల్ని ఇలా లోకువచేసి ఆడించకు. నీ ఆజ్ఞ లేనిదే చీమైనా కదలదట. మనిషి మంచి చేయాలన్నా చెడు చేయాలన్న నీ ఆజ్ఞలే కద? దురాలోచన నాకు కలిగించింది నీవు. తొలగించివలసిన బాధ్యత నీమీదే వున్నది కదా? కర్తవ్యాన్ని తప్పించు కోవాలనుకుంటే మనిషికంటే నీ ఎక్కు వేమిటి? దేవుడనే బిరుదెందుకు? భగ వాన్! మమ్మల్ని కాపాడు. ఈఅమాయ

కుణ్ణి శపించకు. శపించకు దైవమా. ఓ మధు ! నీవు నిశ్చింతగా నిద్ర పోవోయి. నీ కోసం నేను దేవుణ్ణి వరాలడుగుతున్నాను. కనిపించని దేవుని సహాయంతో, కనుపించే నేను నిన్ను కాపాడుతాను. నీకు నేనున్నాను. నా మెడలో మెరిసే ఈ మాంగల్యం (వున్నంత సేపూ నేను వుత్తమ ఇల్లాలిని) నాకు రక్షరేఖ. నేను నీకు రక్షరేఖని. నిన్ను పరమపవిత్రంగా నీ భవిష్యత్తులోకి నడిపిస్తాను మిత్రుడా ! ఎప్పుడు నిద్రపోయానో నాకే తెలియదు. బాత్ రూంలో నీటి శబ్దం విని మెలకువ వచ్చింది. ఎండ తీక్షణంగా వుంది. 7-30 అయింది. మధు స్నానం చేస్తున్న శబ్దం వినిపిస్తోంది. మిత్రుడా స్నానంతో బాటు మనసుని కూడా కడిగివేసుకోవోయి. నిజంగా నే దేవుడు నా మొర విన్నాడు. స్వచ్ఛంగా మధు బయటికి వచ్చాడు. తలారా స్నానం చేశాడు. అతని వంటి మీదనుండి సోపు వాసన హాయిగా వుంది. సూటిగా నా వంక చూడక దువ్వెన కోసం వెతుకుతున్నట్లు నటిస్తున్నాడు. సరిగ్గా ఇదే సమయంలో నేను తెలివిగా వుషారుగా వుంటే ఈ విషమ పరిస్థితి నుండి బయిటపడొచ్చు. అంతేజరిగింది. లేచి దువ్వెన అందించాను. కాఫీ తాగావా? తెమ్మన్నావా ? అన్నాను. అతి సహజంగా - ఓ స్త్రీ ! నటనకు మారుపేరు స్త్రీ. సృష్టికి మారుపేరు స్త్రీ. నాశనానికి మారుపేరు స్త్రీ. నేను స్త్రీని. అందుకే అంత సహజంగా, సర్వీకారంగా అతనితో మాట్లాడాను. నిలువుటద్దంలో నా రూపుమీద చెడ అసహ్యమేసింది. పగలగొడతానేమో అనిపించి పక్కకి జరిగాను.


కావాలని ఎన్నో విషయాలు మాట్లాడాను. కొన్ని పత్రికలు కొన్నాను. ఆ వుదయం ఎక్కడికీ వెళ్ళలేదు. చాలా ప్రయత్నించి అతని బెరుకు పోగొట్టి మళ్ళీ మామూలుగా ఉండేటు చేయగలిగాను. నేను కసిరినందుకే ఏడ్చావేమిటని ఆటలు పట్టించాను. ఒంట్లో నలతగా వుందా అన్నాను. దాంతో తన ఏడ్పుకి, తొట్రుపాటుకి నేను అర్థం గ్రహించలేదని అతను నిర్ణయించుకున్నాడు. దాంతో కాస్త తేరుకున్నాడు. ఒకోసారి నటనా, అబద్ధమూ జీవితానికి ఎంత సహాయం చేస్తాయో రుజువై పోయింది.

సాయంకాలం దగ్గర్లో వున్న ఉడ్ లాండ్ హోటల్‌కి వెళ్ళి స్విమ్మింగ్ పూల్ పక్కన కూర్చున్నాము. అందమైన ఆ పూల్‌లో రకరకాలుగా యీదే వాళ్ళనుచూస్తే సరదాగా వుంది. పక్కనే వున్న సవేరా హోటల్‌కి వెళ్ళాము. ఆ రాత్రి అక్కడ గొప్ప కాబ్రే డాన్సు ఉందట. "సినిమా చూశాం. సర్కస్ చూశాం. నాటకం చూశాం." ఇంతవరకు కాబ్రేడ్యాన్సు చూడడం కుదరలేదు. నువ్వెప్పుడన్నా చూశావా ?" అన్నాను మధుతో. అతను ఇబ్బందిగా ముఖం పెట్టి లేదన్నాడు. అనడంలో చూడాలని కాంక్షవుంది. చూస్తాననడానికి భయం వుంది-మూద్దామా ? అన్న అభ్యర్థన వుంది. మా వూర్లో ఉన్నప్పుడు మధుని ఏకవచన ప్రయోగంచేసి పిలువలేదు.

ఈ రెండు రోజులనుండి "నువ్వు" అని పిలుస్తున్నానని హఠాత్తుగా గుర్తొచ్చింది. "మాట్లాడరేం?" అన్నాను. అతను చనువుగా నవ్వి "కాసేపు నువ్వూ అనీ కాసేపు మీరూ అని పిలుస్తారేమిటి? పిల్లలూ శ్రీవారూ గుర్తొస్తున్నారా?" అని వెనుకటిలాగ మాట్లాడాడు. మధు అలాగే నన్నడగకుండానే తనే దారితీసి డ్యాన్సు హాల్లోకి నడిచాడు. అలాంటి మౌనాధికార మంటేనే నాకు చాల ఇష్టం. చక్కని దుస్తుల్లోవున్న యువకులు రకరకాల విదేశీ వాయిద్యాలు వాయిస్తుంటే ఒక అందమైన యువతీ యువకులు జంటగా పాడుతున్నారు. అక్కడి మనుష్యులూ పరిస్థితి చిత్రంగా ఒక రకమైన కృత్రిమ వాతావరణంగా వున్నది మసాలా వాసనలు మందుల వాసనలు, సిగరెట్లపొగ, విదేశీ సెంటు సువాసన ఈడూ జోడైన జంటలు—ఈడూజోడూ కదా ఏ కోశానా సరిపడని జంటలు, ఒంటరిగాళ్ళు అందరూ అసహజమైన సరదాని కొనుక్కుందామని కాచుకుని కూర్చున్నారు. పాటవింటూ — జనం చూస్తూవుండగానే వాయిద్యం మెల్లగా ఆగిపోయింది. లైట్స్ డిమ్ అయ్యాయి. స్టేజీమీద తళుకుల రూపమొకటి నిలబడి అటూ ఇటూ నడిచి ముందుకి సలాములాంటిదేదో చేసింది. హఠాత్తుగా లైట్లు వెలిగాయి ఒక్కసారిగా వాయిద్యాలన్నీ ఒకేరకపు శబ్దంచేశాయి. ఆ పిల్ల ముందుకి వంగే వున్నది. తెల్లని ఆమె వక్షోజ సౌందర్యం అద్భుతంగా వుంది. తెల్లని వొంటి మీద నల్లని సిల్కు సర్కస్ గౌన్ లాంటిది మెరిసే తళుకులు కుట్టినది వుంది, లిఫ్‌స్టిక్ వేసిన పెదాలు కనుబొమ్మలమీద నీలి తళుకురంగు చాలా ఆకర్షణీయంగావుంది. మ్యూజిక్ వుత్తేజకరంగా వుంది. ఆమె మెరుపు తీగలా మెలికలు తిరుగుతూ బహుశా విదేశీ డ్యాన్సు చేస్తోంది. వొంటి మీద నల్లని డ్రెస్‌ను ఆడుతూనే వదిలేసించి ఇప్పుడామె వొంటిమీద తెల్లని పెటికోట్ లాంటిది వుంది. పాల నురుగులాంటి జాలులో వున్న గౌను మీద ఆ పిల్ల హంసలా వొయ్యారంగా డ్యాన్సు చేస్తున్నది. ఒంట్లో ప్రతి భాగ మూరట్బరుతో చేసినట్లు అన్నిపక్కలా వొంగుతున్నది. ఈ కాబెర్డ్యాన్సుల గురించి చాలా విన్నాను. విన్న దానినిబట్టి ఒక రకపు జుగుప్స ఏర్పరచుకున్నాను. కాని చూస్తున్నప్పుడు ఆ జుగుప్స గుర్తుకి రాలేదు. ఆమె స్టేజీ మీద నుండి దిగి ఆడియన్సు మధ్యకు వచ్చింది. ఒకో టేబిల్ దగ్గర ఆగి మగవాడితో హలో అంది. ఒక్కొక్కరికి సిగరెట్టు అంటించింది. ఒకరి గ్లాసు పట్టుకొని తాగబోయింది. ఒకరి సిగరెట్టు లాక్కుని ఒక్కసారి పీల్చి ఇచ్చేసింది. వాళ్ళుగాని—కూడా వున్న స్త్రీలుగాని – మనం సినిమాల్లో చూసినట్లు వెధవవేషాలు వేయడంలేదు. నవ్వుతూ చూశారు. ఒకరిద్దరు ఈలలు వేశారు. షొట్సు కొట్టారు. ఆ పిల్లకి షేక్‌హాండ్స్ ఇచ్చారు. ఆడియన్సులో నడుస్తూనే తెల్ల గౌను జార్చేసింది. ఇప్పుడిక చిన్న లాగు, బాడీ మాత్రం మిగిలాయి, మా టేబుల్ దగ్గరకివచ్చింది

మధు ముఖం మీద ముఖం పెట్టి భుజాల
మీద చేతులు వేసి "కం విత్ మీ"
అన్నది. అనుకోని ఈ సంఘటనకి మధు
కంగారు పడిపోయాడు- ఇబ్బందిగా
కదిలాడు. భయంగా నావంక చూశాడు.
ఇంతలో ఆపిల్ల ఇంకో చోటికి వెళ్ళి
స్టేజిమీదకి వెళ్ళింది. సింహగర్జనలాంటి
మానవగర్జన వినబడింది. ఉలికి పడి
ఆ శబ్దం వైపు చూశాము. ఆరడుగుల
ఎత్తు, రెండున్నర అడుగుల వెడల్పు
తలపాగా, లాల్చిమీద కట్ కోట్ కుచ్చుల
పైజామా. భయంకరంగా వున్నా-
అందంగాకూడా వున్నాడు. వాడి చేతిలో
చిన్నకొరడా వుంది, ఇంకో చేతిలో
అదేమిటి కొండచిలువ లాగుంది. ఆ
పిల్లని జడిపించాడు, ఆ పిల్ల కెవ్వుమని
పక్కకి తప్పుకుంది. నాకు చెమటలు
పోశాయి. ముఖం తెల్లబడిపోయింది.
ఇప్పుడేదైనా గోల జరిగితే పోలీసులు
రాగలరా? హోటలువాళ్ళు రక్షించ
గలరా? నేరకపోయి వచ్చామే అనుకుం
టుండగా చెల్ మని వినిపించింది.
మ్యూజిక్ ధన్‌మన్నది. లైట్లు ఎర్ర
రంగులో వున్నాయి, ఆ పిల్ల రక్షణ
కోసం అరిచింది. కాబూలీ రాక్షసుడు ఆ
కొండచిలవని ఆ పిల్లమీద విసిరేశాడు.
ఆ విసురుకి పిల్ల నేలమీద కూలిపో
యింది. నే నెందుకో గబుక్కున
లేచాను. మధు నా చెయ్యి పట్టుకుని
కూర్చోబెట్టాడు. అందమైన ఆ పిల్లని
వొంటిని పాము చుట్టేసింది. బాధతో
ఆ పిల్ల లేచింది. నాగస్వరం వాయిస్తు
న్నారు. లైట్లు మారినై. లేచిన ఆ
పిల్ల వయ్యారంగా కళ్లు విరుచుకుని
పాముని ప్రేమగా బుగ్గలకి రాసుకుంది.
రకరకాలుగా పాముతో నాట్యం చేసింది.
అద్భుతంగా వుంది. కాసేపటికి కాబూలీ
వాడు దగ్గరకి వచ్చాడు. ఆ పిల్లవాడిని
ముద్దుపెట్టుకుంది. వాడు పాముని తీసు
కుని తెర లోకి వెళ్ళిపోయాడు.
హమ్మయ్యా! ఇదంతా ప్రదర్శనలో
తమాషా అన్నమాట! బాగుంది.నిజంగా
నాకు నచ్చింది. ఈ సారి స్టేజీమీద
ఎర్రలైట్లతో పాటు కదుల్తున్నమంటల
నీడలు ఫోకస్ చేశారు. ఆ పిల్ల నృత్య
భంగిమ మారింది. శరీరంలో ప్రతి
కండరాన్నీ కుచ్చులుగా ఆడించింది.
"బెల్లీ డ్యాన్సు" చిత్రవిచిత్రంగా
చేసింది. అది శరీరమా? అది పాటా?
ఓహూ! ఎంత నేర్పు? ఎంత అందం!

ఓ ఆంధ్ర దేశమా? నీతీ నియ
మాల పుట్టా!- ఈ నృత్యాన్ని నీవు
చూడగలవా? చూచి ఆనందించగలవా?
మురికి చీకట్లో రెండు రూపాయల
అందాన్ని పూజించే నీవు ఇక్కడి కళా
ఖండాన్ని మెచ్చుకోగలవా? ప్రతీ విష
యంలోను చెడు వుండవచ్చు. మంచి
వుండవచ్చు. నీ కళ్ళకి కుళ్ళు, మనసుకి
చెడు చాలా ఇష్టం. సులువుగా దొరుకు
తుంది. అలా అని అన్నిచోట్ల కాబ్రే
డాన్సు పేరుతో జరిగే, చౌకబారు నగ్న
ప్రదర్శనని నేను మెచ్చుకుంటున్నానని
ప్రోత్సహించుతున్నానని అనుకోవద్దు.
సంప్రదాయ సిద్ధమైన నాట్యాన్ని వదిలి,
రికార్డుల నృత్యాలతో అసభ్యకరంగా
రోడ్లమీద ప్రదర్శించే రెచ్చగొట్టే చవుక
బారు కళాకారుల కంటే, ఆనందించే
ప్రేక్షకులకంటే, ఈ అంతరాంతరాల్లో




డబ్బున్న కొద్దిమందిని ఉత్తేజపరి ఈ రకం డాన్సులు ప్రమాదకరమైనవి కావని నా కనిపిస్తోంది. అలా హాయిన జరిగే ప్రదర్శన ఒంటిగంటకి ముగిసింది. మూడోనాడు గిండీ రోడ్డుమీద స్నేక్ పార్క్ చూశాం. అన్నిరకాల పాములు. ఎన్నో రంగుల పాములు. అందమైన పాములు-ఇంతటి అందం వెనుక భయంకరమైన ప్రమాదం! ఆ ప్రమాదజీవులతో జీవనం గడిపే దురదృష్టవంతులు. ఆ ప్రమాదాన్ని పోగుచేసి ప్రదర్శనకి పెట్టిన ప్రభుత్వం చూచి మురిసిపోయే జనం. ఏమిటో ఇలా ఆలోచిస్తే జీవితంమీద విరక్తి కలుగుతుంది.

మద్రాసు నుండి మైసూరూ, ఊటీ, బెంగుళూరు వెళ్ళాం. మద్రాసు తరవాత మా ఇద్దరికీ ఎటువంటి క్లిష్టపరిస్థితులూ రాలేదు. నిర్వికారంగా, స్నేహంగా అన్నీ చూచి, పదో నాటికి హైదరాబాదు చేరాం. నన్ను ఇంటిలో దిగబెట్టి మధు వెళ్ళిపోయాడు. శ్రీవారు లేరు. పిల్లలిద్దరూ సంతోషంగా ఎదురు వచ్చారు. వాళ్ళకి తెచ్చిన బహుమతులు చూచి ముచ్చటపడ్డారు. మావారు రాగానే ఇవ్వాలని, తనకోసం ఊటీలో కొన్న మంచి స్వెటరు, మద్రాసులో కొన్న పట్టుపంచె, సిల్కు లాల్చీ రెడీగా పెట్టుకుని ఎదురుచూస్తూ కూర్చున్నాను. రాత్రి పొద్దుపోయింది. పిల్లలు పడుకున్నారు. తొమ్మిదింటికి ఆయన వచ్చారు. పది రోజుల ఎడబాటు మాకిదే మొదటిసారి. వస్తూనే ఆయన నవ్వుతూ నాదగ్గరికి వచ్చారు. నేను ఆయన్ని చుట్టుకుపోవా

లన్నంత ఆత్రంగా ముందుకు వెళ్ళాను ఆ క్షణంలో – ఆ క్షణంలో ఆయన ముఖంలో హఠాత్తుగా నవ్వు మాయమైంది. నేనెఱుగని కఠినత్వం కనిపించింది. నాలోను ఏదో జంకు కలిగింది. ఆ పదిరోజుల ప్రయాణానికి మూల కారణం ఇద్దరికీ గుర్తొచ్చింది. మామూలుగా వుండటానికి ఆయన విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. సాధ్యం కాలేదు. తప్పుకుని బాత్ రూంవైపు వెళ్ళారు. ఆయనకోసం తెచ్చిన బట్టలు అలాగే చేత్తోపట్టుకుని నిలబడిపోయాను. కేవలం కాళ్ళుముఖం కడుక్కోడానికి ఐదునిమిషాలు చాలుగాని, ఈరోజు పదిహేనునిమిషాలు పట్టింది టర్కీ టవల్‌తో ముఖం తుడుచుకున్నా ఆయన ముఖం మీద మలినం పోలేదు. నాకు సహజత్వం రాలేదు. మౌనంగా భోజనం చేశాము. గదిలోకొచ్చి నేనిచ్చిన బహుమతులు చూసి "బావున్నాయి" అన్నారు. పొడిగా తన బీరువాలో పెట్టుకున్నారు. ఆ రాత్రి అవి ధరిస్తారని నన్ను దగ్గరకి తీసుకుంటారని, నేనెందుకు ఆశపడ్డానో నాకే తెలియలేదు ఎక్కువ మాట్లాడకుండానే ఎవరిచోటులో వారు నిద్రపోయాం. మర్నాటి నుండి- పూర్వంలాగే ఆయన మాట్లాడారు. నౌకర్లముందు పిల్లలముందు, వచ్చిపోయేవాళ్ళముందు మామూలుగా నాతో మాట్లాడారు. కాని – కాని -ప్రతి రాత్రీ ఆ తర్వాత నేను వచ్చిననాటి రాత్రిలానే జరగసాగింది ఇక నా జీవితాంతం అలాంటి రాత్రులు – అలాంటి ఏకాంతపు బ్రతుకూ తప్పదని నాకు తెలిసిపోయింది. పరువుకోసం, మర్యాదకోసం ఆయన గుట్టుగా కాలం గడుపుతున్నారు. లోకం దృష్టిలో నేనాయన భార్యనే! పిల్లల తల్లిగా, ఇంటియజమానురాలిగా మిగిలిపోయానని లోకానికి తెలియనవసరంలేదు ఎంతో విశాల భావాలు. ఆదర్శాలు ఉన్న మహానుభావుడు కనుకనే ఇంట్లో నా స్థానాన్ని నిలబెట్టారు. ఆయనా మామూలు మనిషే. అంతటి రాములవారే మహా ఇల్లాలని తెలిసినా- నిండు చూలాలనైనా తలవక – కేవలం చాకలివాడి వాగుడుకోసం అడవిలో వదిలేయగా లేనిది – నా శీలం మీద ఎంత నమ్మకమున్నా- మావారు నన్ను తనతో చేర్చుకోలేకపోవడం చాలా సహజమే! ఏమయినా ఆయన రాముడికంటే గొప్పవారే!

